బుధవారం 22-01-2025

# ముందడుగు

దినపత్రిక

సంపుటి: 1, సంచిక: 548 పేజీలు: 4 | ₹6

EPAPER.MUNDADUGU.COM

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD

మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచెయొచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..

Mundadugu whatsapp: 9491114616

email: mundadugu111@gmail.com



## ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో పేలిన తూటా

- గరియాబంద్, నౌపాడ జిల్లాల్లో ఎన్‌కౌంటర్
- 27 మంది మావోయిస్టులు మృతి
- మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా ఆపరేషన్
- మావోయిస్టు కీలక నేతలు మృతి

2 లో

## 70 స్థానాలకు గాను 699 మంది పోటీ

- కోలాహలంగా మారిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు
- అభ్యర్థుల వివరాలు వెల్లడించిన ఎన్నికల సంఘం

2 లో




## నక్సల్స్ లేని భారత్ దిశగా ముందడుగు

- దేశంలో నక్సలిజం కొన ఊపిరితో ఉంది
- కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పందన

2 లో






## దావోస్‌లో.. తెలంగాణ పెవిలియన్

- పలు ప్రాజెక్టులపై కేంద్ర మంత్రులతో చర్చ
- పర్యటిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బృందం


**ముందడుగు జాతీయం**

ప్రపంచ ఆర్థిక వేదిక శిఖరాగ్ర సదస్సులో భాగంగా దావోస్‌లో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బృందం.. అక్కడ తెలంగాణ పెవిలియన్‌ను ప్రారంభించింది. ఈ సందర్భంగా కేంద్ర మంత్రులు చిరాగ్ పాశ్వాన్, జయంత్ చౌదరీలతో రేవంత్ బృందం సమావేశమైంది. రాష్ట్రానికి చెందిన పలు ప్రాజెక్టులపై కేంద్ర మంత్రులతో చర్చించింది. మరోవైపు దావోస్‌లో పలు అంతర్జాతీయ సీఈవోలతో సీఎం రేవంత్ రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు భేటీ కానున్నారు.

## సీఎం తొందరపాటు చర్యలు తీసుకోకూడదు

- మాకు తీర్పు కాపీ వచ్చాక నిర్ణయించుకుంటాం
- ఆర్జీకర్ మృతురాలి తండ్రి ప్రకటన

3 లో



## బిజెపి పాలిత రాష్ట్రాల్లోనే.. పేపర్ లీకేజీలు

3 లో

- పేపర్ లీక్‌లతో హక్కులు కాలరాస్తున్నారు..
- కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ ఆరోపణ



ముందడుగు
బుధవారం
22-01-2025
హైదరాబాద్

# ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో పేలిన తూటా

**ముందడుగు ఛత్తీస్‌గఢ్**



దండకారణ్యం మళ్లీ నెత్తురోడింది.. ఛత్తీస్‌గఢ్-ఒడిశా సరిహద్దులో భారీ ఎన్‌కౌంటర్ కొనసాగుతోంది. గరియాబంద్, నౌపాడ జిల్లాల్లో భద్రతాబలగాలతో జరిగిన ఎదురుకాల్పుల్లో ఇప్పటి వరకు 27 మంది మావోయిస్టులు మృతి చెందినట్టు సమాచారం. భీకర ఎన్‌కౌంటర్ కొనసాగుతుండటంతో రెండు రాష్ట్రాల సరిహద్దులోని అటవీప్రాంతం రణరంగంలా మారింది. ఎన్‌కౌంటర్‌లో ఇప్పటి వరకు 27 మంది మావోయిస్టులు మృతి చెందినట్టు భద్రతా బలగాలు గుర్తించాయి. మరి కొంత మందికి తీవ్రగాయాలవడంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశముందని భావిస్తున్నారు. ఇప్పటి వరకు 16 మంది మావోయిస్టుల మృతదేహాలను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి.

మావోయిస్టులను చుట్టుముట్టిన కోబ్రా సైనికులు లొంగిపోవాలని హెచ్చరికలు జారీ చేశారు. మరో వైపు ఏకే 47లతో మావోయిస్టులు పెద్ద ఎత్తున కాల్పులు జరుపుతున్నారు. ఘటనా స్థలంలో మావోయిస్టు అగ్రనేతలు ఉన్నారన్న సమాచారంతో భద్రతా బలగాలు ఆపరేషన్ ముమ్మరం చేశాయి.

మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా సరిహద్దు జిల్లాలైన గరియాబంద్, నౌపాడలో ఛత్తీస్‌గఢ్, ఒడిశా పోలీసులు, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది కలిసి ప్రత్యేక ఆపరేషన్ నిర్వహిస్తున్నారు. ఈక్రమంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో నిన్న ఇద్దరు మావోయిస్టులు మృతి చెందగా.. తెల్లవారుజామున జరిపిన గాలింపులో మరో 12 మంది మృతదేహాలు లభ్యమయ్యాయి. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. అలాగే భారీస్థాయిలో ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఇంకా ఈ ప్రాంతంలో సెర్చ్ ఆపరేషన్ జరుగుతోంది. ఇందులో వెయ్యి మంది వరకు భద్రతా సిబ్బంది పాల్గొన్నట్లు తెలుస్తోంది.

### మావోయిస్టు కీలక నేతలు మృతి

ఈ ఎదురుకాల్పుల్లో మావోయిస్టు కీలక నేతలు మృతి చెందారు. వారిలో కేంద్ర కమిటీ సభ్యులు చలపతి అలియాస్ జయరామ్, మనోజ్, స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు గుడ్డు ఉన్నారు. చలపతిపై ప్రభుత్వం గతంలో రూ.కోటి రివార్డు ప్రకటించింది.

# నక్సల్స్ లేని భారత్ దిశగా ముందడుగు

**ముందడుగు జాతీయం**

మావోయిస్టుల ఏరివేత లక్ష్యంగా భద్రతా బలగాలు ఇప్పటికీ ఆపరేషన్ నిర్వహిస్తున్నాయి. దీనిపై తాజాగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పందించారు. ఇది నక్సల్స్ లేని భారత్ దిశగా కీలక అడుగని వ్యాఖ్యానించారు. దేశంలో నక్సలిజం కొన ఊపిరితో ఉందన్నారు.

“ఇది నక్సలిజానికి గట్టి ఎదురుదెబ్బ. మన భద్రతా బలగాలకు ఇది గొప్ప విజయం. నక్సల్స్ లేని భారత్ దిశగా ఇది ఓ కీలక అడుగు. దేశంలో నక్సలిజం కొన ఊపిరితో ఉంది. సీఆర్‌పీఎఫ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన బలగాలు ఈ జాయింట్ ఆపరేషన్‌లో భాగమయ్యాయి” అని అమిత్ షా స్పందించారు.

ఛత్తీస్‌గఢ్-ఒడిశా సరిహద్దు జిల్లాలైన గరియాబంద్, నౌపాడలో జనవరి 19 రాత్రి నుంచి ఈ ప్రత్యేక ఆపరేషన్ జరుగుతోంది. పలుమార్లు జరిగిన ఎన్‌కౌంటర్లలో ఇప్పటివరకు 20 మంది మావోయిస్టులు మృతి చెందారు. వారిలో కీలక నేతలు కూడా ఉన్నారు.

# 70 స్థానాలకు గాను 699 మంది పోటీ

**ముందడుగు ఢిల్లీ**

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల కోలాహలం కొనసాగుతోంది. అధికార, విపక్ష పార్టీల ఆరోపణలు, ప్రత్యారోపణలతో రాజకీయాలు వేడెక్కాయి. ఈ ఎన్నికల్లో మొత్తం 70 స్థానాలకు గాను 699 మంది అభ్యర్థులు బరిలో నిలిచినట్లు ఎన్నికల సంఘం అధికారులు మంగళవారం వెల్లడించారు. 2020 అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే (672మంది అభ్యర్థులు) ఈసారి పోటీ చేసేవారి సంఖ్య కాస్త అధికంగానే ఉన్నట్లు తెలిపారు. ఢిల్లీ ఎన్నికల ప్రధాన అధికారి వెల్లడించిన వివరాల ప్రకారం.. ఈసారి 981 మంది అభ్యర్థులు 1522 నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ గడువు పూర్తి కావడంతో బరిలో నిలిచిన అభ్యర్థుల జాబితాను తాజాగా ప్రకటించారు.

ఆప్ అధినేత, మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, భాజపా అభ్యర్థి పర్వేశ్ వర్మ, కాంగ్రెస్ అభ్యర్థి సందీప్ దీక్షిత్ పోటీ చేస్తున్న న్యూఢిల్లీలోనే అత్యధికంగా 23మంది పోటీలో ఉన్నారు.

# దిల్ రాజు ఇళ్లు, కార్యాలయాల్లో ఐటీ సోదాలు

## పుష్ప 2’ చిత్రం నిర్మాత నవీన్ ఎర్నేని నివాసంలో సోదాలు

**ముందడుగు హైదరాబాద్**



ఐటీ అధికారులు ప్రముఖ నిర్మాత, తెలంగాణ ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజు ఇళ్లు, కార్యాలయాల్లో సోదాలు నిర్వహించారు. దీనితో పాటు ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీస్ కార్యాలయాలు, ‘పుష్ప 2’ చిత్రం నిర్మాత నవీన్ ఎర్నేని నివాసంలో సోదాలు జరుగుతున్నాయి. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్‌లో దిల్ రాజు ఇళ్లతో పాటు ఆయన సోదరుడు శిరీశ్, కుమార్తె హన్సితరెడ్డి నివాసాల్లోనూ ఐటీ అధికారులు సోదాలు చేస్తున్నారు. దిల్ రాజు సతీమణి వైగారెడ్డిని కారులో తీసుకెళ్లారు. బ్యాంక్ లాకర్లను పరిశీలించి అనంతరం ఇంటికి తీసుకువచ్చారు. వ్యాపార భాగస్వాముల నివాసాల్లోనూ తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన వివిధ పత్రాలను అధికారులు పరిశీలిస్తున్నారు.

బ్యాంక్ లాకర్లు ఓపెన్ చేయడానికి ఆదాయపుపన్ను అధికారులు తనను తీసుకెళ్లినట్లు దిల్ రాజ్ భార్య తెలిపారు. “ఉదయం నుంచి ఐటీ శాఖ అధికారులు సోదాలు చేస్తున్నారు. సినిమాలకు సంబంధించి తనిఖీలు చేస్తున్నారు. ఇవి సాధారణంగా జరిగే సోదాలు మాత్రమే. ఐటీ శాఖ అధికారులు బ్యాంకు వివరాలు కావాలని అడిగారు. బ్యాంకు లాకర్స్ ఓపెన్ చేసి చూపించాం” అని ఆమె తెలిపారు.

ముందడుగు
బుధవారం
22-01-2025
హైదరాబాద్

# మహా కుంభమేళాకు గౌతమ్ అదానీ..

## భక్తులకు స్వయంగా భోజనం వడ్డింపు



ముందడుగు ఉత్తర్రప్రదేశ్

ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక వేడుక మహా కుంభమేళా ఘనంగా జరుగుతోంది. ప్రయాగ్‌రాజ్ త్రివేణి సంగమంలో పుణ్య స్నానాలు ఆచరించేందుకు కోట్లాది మంది తరలివస్తున్నారు. సాధారణ ప్రజలతో పాటు పలువురు వ్యాపారవేత్తలు కూడా ఈ వేడుకలో పాల్గొంటున్నారు. తాజాగా అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ, భార్య ప్రీతీ అదానీ (అదానీ ఫౌండేషన్ ఛైర్‌పర్సన్), కుమారుడు కరణ్ అదానీ (అదానీ పోర్ట్స్ అండ్ లిమిటెడ్ ఎండీ)తో కలిసి మహాకుంభమేళాలో పాల్గొన్నారు.

గంగ, యమున, సరస్వతి నదుల సంగమంలో అదానీ కుటుంబం ప్రత్యేక పూజలు నిర్వహించింది. అనంతరం కుటుంబంతో కలిసి స్థానికంగా ఉన్న ఇస్కాన్ ఏర్పాటు చేసిన శిబిరాన్ని గౌతమ్ అదానీ సందర్శించారు. ఇక్కడ భోజన తయారీలో పాలుపంచుకున్నారు. భక్తులకు స్వయంగా వడ్డించారు.

### బిజెపి పాలిత రాష్ట్రాల్లోనే

# పేపర్ లీకేజీలు

ముందడుగు జాతీయం

దేశంలోని బిజెపి పాలిత రాష్ట్రాల్లో పేపర్ లీకేజీ ఘటనలు నమోదవుతున్నాయని, పేపర్ లీకలను యువత హక్కులను కాలరాసే ఆయుధంగా కాషాయ పార్టీ మార్చుకుందని కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు చేశారు.

బిజెపి పాలిత రాష్ట్రాల్లో నిత్యం ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. నిరసనలు చేపట్టిన బీపీఎస్సీ అభ్యర్థులపై పోలీసులు లాఠీ ఛార్జీ చేశారు. అభ్యర్థులను కలిసినప్పుడు తమకు జరిగిన అన్యాయాన్ని వివరించారు. పేపర్ లీక్ అయితే.. కచ్చితంగా అది సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతుంది. ప్రస్తుతం అభ్యర్థులు తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారు. గాంధేయ మార్గంలో నిరసన తెలుపుతున్న వారిపై పోలీసులు దాడికి యత్నించారు. బాధితులపై కేసులు పెట్టారు" అని రాహుల్ గాంధీ తన యూట్యూబ్ ఛానెల్‌లో వీడియో పోస్టు పెట్టారు.

### సీఎం తొందరపాటు

# చర్యలు తీసుకోకూడదు

ముందడుగు పశ్చిమబెంగాల్

పశ్చిమబెంగాల్ ఆర్జీకర్ ఘటనలో దోషి సంజయ్‌రాయ్‌కు మరణశిక్ష విధించాలంటూ బెంగాల్ సర్కారు మంగళవారం కలకత్తా హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. ప్రభుత్వం తీరును మృతురాలి తండ్రి తప్పుపట్టారు. ఈ వ్యవహారంలో సీఎం మమతా బెనర్జీ తొందరపాటు చర్యలు అవసరం లేదని అన్నారు.

'రేపు మాకు తీర్పు కాపీ వస్తుంది. దానిని పరిశీలించిన తర్వాత ఏమి చేయాలో నిర్ణయించుకుంటాం. అప్పటివరకు సీఎం మమతా బెనర్జీ తొందరపాటు చర్యలు తీసుకోకూడదు. ఆమె ఎన్నో మాటలు చెప్పి.. సాక్ష్యాలను తారుమారు చేశారు. వాటిని తారుమారు చేసిన వారిలో పోలీస్ కమిషనర్, ఇతరుల ప్రమేయం ఉంది. ఇవన్నీ మమత చూడలేదా..?" అని సూటిగా ప్రశ్నించారు. సీబీఐ సరైన సాక్ష్యాధారాలు సమర్పించలేకపోవడం వల్లే..స్థానిక కోర్టులో జీవిత ఖైదు పడినట్లు భావిస్తున్నామని వెల్లడించారు.

### డబ్ల్యూహెచ్‌వో నుంచి

# వైదొలిగిన అమెరికా..


## తమ పూర్తి మద్దతు డబ్ల్యూహెచ్‌వోకు ఉంటుంది

## కీలక ప్రకటన చేసిన చైనా

ముందడుగు జాతీయం

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రపంచ ఆరోగ్య సంస్థ నుంచి వైదొలగాలని నిర్ణయించిన నేపథ్యంలో చైనా కీలక ప్రకటన చేసింది. యూఎస్ఏ వైదొలిగినా డబ్ల్యూహెచ్‌వోకు తమ పూర్తి మద్దతు ఉంటుందని స్పష్టం చేసింది. అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ ప్రమాణస్వీకారం చేసిన తర్వాత అనూహ్య నిర్ణయాలు తీసుకున్న సంగతి తెలిసిందే. అందులో ప్రపంచ ఆరోగ్య సంస్థ నుంచి అమెరికా వైదొలగడం కూడా ఉంది. కొవిడ్ వ్యాప్తి సమయంలో ఈ సంస్థ బాధ్యతారాహిత్యంగా వ్యవహరించినందుకే ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు.

ఈ నేపథ్యంలో చైనా స్పందించింది. డబ్ల్యూహెచ్‌వోకు తమ మద్దతు కొనసాగుతుందని ప్రకటించింది. " ప్రపంచ ఆరోగ్య సంస్థను మరింత బలోపేతం చేయాలి తప్ప.. బలహీన పరచకూడదు" అని చైనా విదేశాంగశాఖ అధికార ప్రతినిధి జియాకున్ పేర్కొన్నారు. డబ్ల్యూహెచ్‌వో కార్యకలాపాలకు చైనా సహకారం ఉంటుందన్నారు. ఆరోగ్యకర ప్రపంచం కోసం ఎల్లప్పుడూ కృషి చేస్తామన్నారు.



ముందడుగు
బుధవారం
22-01-2025
హైదరాబాద్

## ఆర్జీకర్ వైద్యురాలి మృతదేహంపై

# మహిళ డీఎన్ఏ

### మహిళ డీఎన్ఏపై అనుమానం

### కోర్టుకు సమర్పించిన రిపోర్టులో వెల్లడి?




**పశ్చిమబెంగాల్**

పశ్చిమబెంగాల్ ఆర్జీకర్ ఆస్పత్రి వైద్యురాలిపై హత్యాచారం కేసులో దోషి సంజయ్ రాయ్‌కి న్యాయ స్థానం జీవిత ఖైదు విధించిన సంగతి తెలిసిందే. విచారణలో భాగంగా సెంట్రల్ ఫోరెన్సిక్ లాబొరే టరీ కోర్టుకు సమర్పించిన రిపోర్టులోని విషయాలు తాజాగా వెలుగులోకి వచ్చాయి. మృతురాలి శరీరం పై ఓ మహిళ డీఎన్ఏ లభించినట్లు అందులో పేర్కొంది.జూనియర్ వైద్యురాలి అత్యాచార ఘటనలో దోషిగా తేలిన సంజయ్‌రాయ్ డీఎన్ఏ 100 శాతం మృతురాలి శరీరంపై కనుగొన్నారు. అదేవిధంగా అతికొద్ది స్థాయిలో ఓ మహిళ డీఎన్ఏ సైతం బయటపడింది. అయితే, అది పొరపాటున ఈ డీఎన్ఏతో కలిసిందా లేక సదరు మహిళ కూడా నేరంలో భాగమైందా అనే విషయంలో స్పష్టత రావాల్సిఉంది.

## ఏసుబాయిగా రష్మిక మందన్నా..

పుష్ప ఫ్రాంచైజీ ప్రాజెక్ట్‌తో నేషనల్ క్రష్‌గా మారిపోయింది కన్నడ సోయగం రష్మిక మందన్నా. గ్లామరస్ పాత్రలతో నటనకు ఆస్కారమున్న రోల్స్‌లో నటిస్తూ టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలుస్తుంటుంది రష్మిక. ఈ భామ ఖాతాలో బ్యాక్ టు బ్యాక్ సినిమాలు లైన్‌లో ఉన్నాయి. ఈ భామ నటిస్తోన్న సినిమాల్లో ఒకటి. మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ మహరాజ్ జీవిత కథ ఆధారంగా వస్తోన్న ఈ మూవీకి లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వం వహిస్తున్నాడు.

ఈ చిత్రంలో విక్కీ కౌశల్ టైటిల్ రోల్‌లో నటిస్తుండగా.. ఇందులో రష్మిక ఛత్రపతి శివాజి సతీమణి మహారాణి ఏసుబాయిగా నటిస్తోంది. ఈ మూవీని ఫిబ్రవరి 14న విడుదల చేయబోతున్నారు. ప్రతి గొప్ప రాజు వెనుక అసమానమైన బలం కలిగిన రాణి ఉంటుంది. స్వరాజ్యం గర్వపడే మహారాణి యేసుబాయి.. అని ట్వీట్ చేస్తూ తన పాత్ర లుక్‌ను షేర్ చేసింది రష్మిక మందన్నా. ఈ మూవీ ట్రైలర్ రేపు లాంచ్ చేయనున్నట్టు ప్రకటించింది. ఇందులో రష్మిక పాత్ర చాలా పవర్ ఫుల్‌గా ఉండబోతుందని తాజా లుక్ చెప్పకనే చెబుతోంది.




## విద్యార్థుల్లో నాయకత్వ స్ఫూర్తి స్వయం పరిపాలన

### ప్రధాన అధ్యాపకులు పోశాల వీరమల్లు




**ముందడుగు వెంకటాపూర్**

ములుగు జిల్లా వెంకటాపూర్ మండల కేంద్రంలోని వేదవ్యాస ఉన్నత పాఠశాలలో ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు పోశాల వీరమల్లు హాజరై విద్యార్థులను అభినందించారు. స్వయం పరిపాలన అంటే కేవలం పాలన విధానం కాదు ఇది ప్రజాస్వామ్యానికి శక్తివంతమైన సమాజానికి మరియు జవాబుదారితనానికి నాంది అన్నారు. చిన్నచిన్న అడుగులు మీ భవిష్యత్తు నాయకత్వానికి బలమైన అడుగుజాడలు అవుతాయని విద్యార్థులను ఉద్దేశించి అన్నారు. ఈ కార్యక్రమానికి వన్డే ప్రధాన అధ్యపకురాలిగా ఎండి అమీనా కరస్పాండెంట్ గా పత్తి సిరి చందన, ఎంఈఓగా బోళ్ల మనోహర్, పీఈటీలుగా బొంతల నవీన్, పులి కార్తిక్, బేతి రామ్ చరణ్ ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులుగా పులి శ్రావ్య, షణ్ముఖశ్రీ, బిందు పవన్, తేజ్ మనోహర్, టి రామ్ చరణ్, యువశ్రీ, శంరోజ్, రాంచరణరెడ్డి, వంశీ, హర్షిత, ప్రియ, షణ్ముఖ శ్రీ బోధన చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం సూర్య ప్రకాష్ రెడ్డి రాజయ్య ఉపాధ్యాయులు శ్రావణ్, మాలతి పాల్గొన్నారు.

### రహదారి భద్రతా జాగృతి

## ప్రచారాన్ని చేపట్టిన హెచ్‌డీఎఫ్‌సీ

**హైదరాబాద్**

HDFC ERGO

భారతదేశంలోని ప్రముఖనాన్-లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ హెచ్‌డీఎఫ్‌సీ ఎర్గో జనరల్ ఇన్సూరెన్స్, సురక్షితం కాని డ్రైవింగ్ పద్ధతుల తో ఎదురయ్యే ప్రమాదాలగురించి అవగాహన పెంచడం, బాధ్యతా యుతమైన రహదారిపై డ్రైవింగ్‌ను ప్రోత్సహించే లక్ష్యంతో (తప్పుడు మార్గంలో వెళ్లవద్దు) అనే క్యాంపెయిన్‌ను ప్రారంభించింది. అతి వేగం, వాహనంనడుపుతూ మొబైల్ ఫోన్ వినియోగించడం, నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడం తదితర కారణాలతో సంభవించే ప్రమాదాలతో భారతీయ రహదారులపై పెద్ద సంఖ్యలో మరణాలు, తీవ్రమైన క్షతగాత్రులను చూస్తున్నాము. ఆందోళనకరంగా, 2022లో దేశంలో 4.60 లక్షల రోడ్డు ప్రమాదాలు జరిగాయి.

హెచ్‌డీఎఫ్‌సీ ఎర్గో జనరల్ ఇన్సూరెన్స్ డైరెక్టర్మరియు చీఫ్ బిజినెస్ ఆఫీసర్ పార్థనిల్ ఘోష్ మాట్లాడుతూ, "రహదారి ప్రమాదాల్లోని మరణాలు కుటుంబాలకు విపరీతమైనభావోద్వేగాన్ని కలిగించి, ఆర్థికసంక్షోభానికి దారితీస్తాయి. అదనంగా, ఇది భారత స్థూల జాతీయోత్పత్తిని కూడా ఏటా 3 నుండి 5%వరకు గణనీయంగా దెబ్బతీస్తుంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ తాజాగ్లోబల్ స్టేటస్ రిపోర్ట్ ఆన్ రోడ్ సేఫ్టీ ప్రకారం, భారతదేశంలో రహదారి ట్రాఫిక్ ప్రమాదాల సంఖ్య పెరుగుతూనే ఉంది.